'అమృతం'.. ఆలస్యం

- ఆదోని పట్టణంలో తాగునీటి సమస్య
- కేంద్ర ప్రభుత్వ అమృత్ పథకం కింద నిధుల మంజూరు
- అనివార్య కారణాలతో మధ్యలో నిలిచిన పనులు
- 20 శాతం పనులు పెండింగ్
- పనులు పూర్తిచేసి తాగునీరు అందించాలని కోరుతున్న పురప్రజలు

ఆదోని సెంట్రల్: పట్టణంలో తాగునీరు, డ్రైనేజీ వ్యవస్థను మెరుగు పరచడానికి గతంలో కేంద్ర ప్రభుత్వ అమృత్ పథకం కింద పనులు చేపట్టారు. అనివార్య కారణాల వలన పనులు మధ్యలోనే నిలచిపోయాయి. దీంతో పట్టణవాసులకు తాగునీటి కష్టాలు తప్పడంలేదు. వేసవి సమీపిస్తుండటంతో సమస్య మరింత జటిలమయ్యే ప్రమాదం ఉంది. పనులను తిరిగి ప్రారంభించి పూర్తి చేస్తే తాగునీటి సమస్య పరిష్కారం అయ్యే అవకాశం ఉంది. కూటమి ప్రభుత్వం చొరవతీసుకొని మధ్యలో నిలచిపోయిన నీటి పథకాలను పూర్తి చేసి నీటి వనరులను పెంచుకుని సమస్యకు చూపాలని పట్టణవాసులు కోరుతున్నారు.



నిర్మాణాలు మధ్యలో నిలిచిపోయిన నీటి ట్యాంకులు

80 శాతం పనులు పూర్తి..

పట్టణంలోని జానాభా ప్రాతిపదికన కేంద్ర ప్రభుత్వం అమృత్ పథకం కింద మౌలిక వసతుల కల్పనకు శ్రీకారం చుట్టింది. అమృత్ పథకం మొదటి విడత కింద విడుదలైన రూ.10 కోట్లుతో పట్టణంలో తాగునీటి పైపు లైన్లు అదనపు కుళాయి కనెక్షన్లు వంటి పనులను చేపట్టారు. రెండో విడత కింద 2016–19 మధ్యకాలంలో ఆదోని పురపాలక సంఘానికి రూ. 24 కోట్లు నిధులు మంజూరు చేసింది. కుళాయి కనెక్షన్లకు అనుగుణంగా రెండవ విడతలో నీటి సామర్థ్యం పెంచేందుకు నీటి ట్యాంకుల నిర్మాణ పనులను చేపట్టారు. రెండు ఒవర్ హెడ్ ట్యాంకులు, రెండు ఈఎల్ఎస్ఆర్‌లు, సరఫరా చేసే నీటి పైపులతో కూడిన నిర్మాణ పనులను చేపట్టాల్సి ఉంది. దాదాపు 80 శాతం పనులు పూర్తి అయ్యాయి. మిగిలిన 20 శాతం పూర్తి చేయాల్సి ఉంది. నిర్మాణంలో జాప్యం, సకాలంలో బిల్లులు రాక పోవడం తదితర కారణాలతో పనులు నిలచిపోయాయి. పనులను పూర్తి చేసి తాగునీటి సామార్థ్యాలను మెరుగుపరుచుకోవాల్సిన అవసరం ఉంది.

వార్డుల వారీగా 3,4 రోజులకు ఒకసారి సరఫరా

ఆదోని పట్టణంలో 2లక్షలకు పైగా జానాభా ఉంది. పట్టణంలో దాదాపు 42 వార్డులు ఉన్నాయి. వార్డుల ప్రకారం అయా వార్డులలో 3–4 రోజులు, మరి కొన్ని వార్డులలో 4–5 రోజులకు ఒక సారి నీటిని సరఫరా చేస్తున్నారు. కుళాయిల మరమ్మతులు వంటి సమస్యలు వస్తే వారం పది రోజులైనా నీటి సరఫరా కాని రోజులు కూడా ఉన్నాయి. ఇక శివారు కాలనీల పరిస్థితి మరీ అధ్వానంగా ఉంది. తాగు నీటి కోసం కొన్ని సార్లు ఘర్షణలు పడాల్సిన పరిస్థితి. రానున్నది వేసివి కాలం కావున పరిస్థితి మరింత జటిలమయ్యే అవకాశం ఉంది. ఇప్పుడు మెలుకొని పరిస్థితిని మెరుగు పరుచుకుంటే తప్ప తాగునీటి సమస్య తీరదని ప్రజాసంఘాల నాయకులు పేర్కొంటున్నారు. అధికారులు, పాలకులు స్పందించి మధ్యలో నిలచిపోయిన తాగునీటి ట్యాంకుల నిర్మాణాలను పూర్తి చేసి, మరింతగా నీటి వనరులను సమకూరిస్తే తాగునీటి సమస్య పరిష్కారమవుతుందని అభిప్రాయపడుతున్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరించాలి



పట్టణంలో తాగునీరు ప్రస్తుతం 3–4 రోజులకు ఒకసారి వదలడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. కొన్ని సార్లు పైపులైన్లు మరమ్మతులు వంటి సమస్యలు వచ్చినప్పుడు వారం పదిరోజులైన నీళ్లు రావు. దీంతో అవస్థలు పడాల్సిన పరిస్థితి. వచ్చేది వేసవి కాలం. అధికారులు స్పందించి తాగునీటి వనరులకు అవసరమైన సదుపాయాలను ఏర్పాటు చేసి తాగునీటి సమస్యను పరిష్కరించాలి.

– వీరేష్, దివాకర్ రెడ్డి నగర్, ఆదోని

నిలిచి పోయిన పనులను చేపట్టాలి



పట్టణ ప్రాంతాల్లో తాగునీటి అవసరాలు, డ్రైనేజీ వంటి సమస్యలను పరిష్కరించడానికి అమృత్ పథకం తెరపైకి తెచ్చారు. అయితే దాదాపు 80 శాతం పనులను చేపట్టారు. 20 శాతం పనులు చేస్తే పూర్తి అవుతుంది. రోజురోజుకు పెరుగుతున్న జానాభా ప్రాతిపదికన నీటి వనరులను కూడా సమకూర్చుకోవాలి. దీంతో పట్టణంలో కొంత మేర తాగునీటి సమస్య పరిష్కారం అయ్యే అవకాశం ఉంది. అధికారులు, పాలకులు స్పందించి తక్షణమే పనులను చేపడితే బాగుంటుంది.

– డి. లక్ష్మన్న, సీపీఎం పట్టణ కార్యదర్శి

క్లుప్తంగా

తహసీల్దార్ కార్యాలయం తనిఖీ



రికార్డులు పరిశీలిస్తున్న ఆదోని సబ్ కలెక్టర్ మౌర్యభరద్వాజ్

ఎమ్మిగనూరురూరల్: స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని బుధవారం సాయంత్రం ఆదోని సబ్ కలెక్టర్ మౌర్యభరద్వాజ్ ఆకస్మిక తనిఖీ చేశారు. తహసీల్దార్ కార్యాలయం, వీఆర్వో, ఆర్ఐ, డిప్యూటీ తహసీల్దార్ల గదులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా సేవలు అందించాలని చెప్పారు. రికార్డుల జాగ్రత్తగా భద్రపరుకోవాలని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే రికార్డులు తారుమారు అయ్యే అవకాశం ఉందని హెచ్చరించారు. తహసీల్దార్ శేషఫణి, డిప్యూటీ తహసీల్దార్ వీరేంద్రగౌడ్, వీఆర్వో మోహన్ తదితరులు ఉన్నారు.

సీసీ రోడ్లు, డ్రైనేజీలు నిర్మించాలి



రోడ్డుపై మురుగునీరు చూపుతున్న మహిళలు

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని సంజీవయ్య నగర్ సమీపంలోని రాఘవేంద్ర కాలనీలో సీసీ రోడ్లు, డ్రైనేజీలు, మంచినీటి పైపులైన్లను ఏర్పాటు చేసి కాలనీ వాసుల సమస్యలు పరిష్కరించాలని ఏపీ మహిళా సమాఖ్య పట్టణ కార్యదర్శి ఈరమ్మ డిమాండ్ చేశారు. బుధవారం కాలనీలోని మహిళలతో కలిసి రోడ్డుపై పారుతున్న మురుగునీటిని పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ కాలనీలో కనీస మౌలిక సదుపాయాలు లేక ఇబ్బందులు పడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు.

ఆశా వర్కర్లకు రూ.26వేల వేతనం ఇవ్వాలి

కౌతాళం: ప్రభుత్వం ఆశా వర్కర్లకు రూ.26 వేల వేతనం ఇవ్వాలని, పీఎఫ్ఎస్ సౌకర్యం కల్పించాలని ఆశా వర్కర్ల సంఘం నాయకులు డిమాండ్ చేశారు. మండల పరిధిలోని బదినేహాల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశవర్కర్ల ప్రత్యేక సమావేశం జిల్లా కార్యదర్శి రంజాన్‌బీ, జిల్లా నాయకురాలు రాధమ్మల సమక్షంలో నిర్వహించారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు పేదలకు అందే విధంగా ప్రతి పథకం ప్రజలకు చేరేందుకు ఆశ వర్కర్లు కీలక పాత్ర పోషిస్తున్నారన్నారు. అనంతరం మండల ఆశ వర్కర్స్ యూనియన్‌ను ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా చాంద్‌బీ, కార్యదర్శిగా కృష్ణవేణి, సహాయ కార్యదర్శిగా ద్యానమ్మ, ఉపాధ్యక్షురాలిగా మాణిక్యమ్మ, కోశాధికారిగా కృష్ణవేణిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

గుర్తు తెలియని వృద్ధుడి మృతి



మృతి చెందిన గుర్తు తెలియని వృద్ధుడు

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో గుర్తు తెలియని 60 ఏళ్ల వృద్ధుడు అనారోగ్యంతో మృతి చెందాడు. మంగళవారం మధ్యాహ్నం అనారోగ్యంతో ఆసుపత్రికి వచ్చి వైద్యులకు చూపించుకునేందుకు ఓపీ తీసుకున్న తరువాత మృతిచెందాడు. విషయాన్ని వైద్యులు పోలీసులకు సమాచారం ఇవ్వగా వృద్ధుడి ఆధారాల కోసం ప్రయత్నించినా లభించలేదు. దీంతో బుధవారం అనాథ వృద్ధుడిగా నిర్ధారించి వారు పోలీసులు, మున్సిపల్ సిబ్బంది, పూలే అంబేద్కర్ ఎడ్యుకేషనల్ సొసైటీ సభ్యులు సింగనేటి నర్సన్న, ప్రతిభ భారతి, మల్లెల గ్రూప్ అధినేత మల్లెల ఆల్‌ఫ్రెడ్‌రాజు, కామలే గణేష్, సతీష్ పట్టణంలోని హిందూ శ్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహించారు.

వ్యవసాయ విద్యుత్ సరఫరాలో మార్పు

ఆదోని రూరల్: మండలంలో బుధవారం రాత్రి నుంచి వ్యవసాయ బోరుబావులకు సరఫరా చేసే విద్యుత్ సమయ వేళల్లో మార్పులు చేస్తున్నట్లు రూరల్ విద్యుత్ ఏఈ చెన్నయ్య విలేకరులకు తెలిపారు. ఆదోని రూరల్‌లోని బైచిగేరి, దిబ్బనకల్, గణేకల్, కల్లుబావి, మార్కెట్‌యార్డు, పెద్దతుంబళం, పెసలబండ, సంతెకూడ్లూరు, దొడ్డనకేరి, ఆరేకల్, హనుమాన్‌నగర్, ఇండస్ట్రియల్ ఎస్టేట్ ఆదోని, సాదాపురం పరిధిలో సబ్‌స్టేషన్‌లు ఉన్నాయన్నారు. విద్యుత్ సరఫరాలో మార్పులు జరిగాయని ఆయన తెలిపారు. ఈ విషయాన్ని వ్యవసాయదారులు, రైతులు గమనించాలన్నారు.

నాటుసారా స్వాధీనం

ఆదోని అర్బన్: పట్టణంలోని వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని చౌదరిబావి వద్ద నాటుసారా తరలిస్తున్న ముగ్గురిని వన్‌టౌన్ పోలీసులు బుధవారం అదుపులోకి తీసుకున్నారని ఎస్ఐ రామస్వామి తెలిపారు. హనుమంతమ్మ, మరో ఇద్దరు 15 లీటర్ల నాటుసారాను తరలిస్తుండగా వారిపై దాడి చేసి నాటుసారాను స్వాధీనం చేసుకున్నామన్నారు. ముగ్గురిపై కేసులు నమోదు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు చెప్పారు. ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రైతులకు ఉపయోగపడని కేంద్ర బడ్జెట్



సబ్‌కలెక్టర్ కార్యాలయ అధికారిణి వసుంధరకు వినతి పత్రం అందజేస్తున్న రైతు సంఘం నాయకులు



కోసిగిలో బడ్జెట్ ప్రతులను దహనం చేసి నిరసన తెలుపుతున్న సీఐటీయూ నాయకులు

ఆదోని రూరల్: ఇటీవల కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో ప్రవేశపెట్టిన బడ్జెట్ రైతులకు ఉపయోగకరంగా లేదని రైతు సంఘం నియోజకవర్గ కార్యదర్శి బసాపురం గోపాల్, నియోజకవర్గ ఉపాధ్యక్షుడు కె.అంజిత్‌గౌడ్ అన్నారు. బుధవారం స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆందోళన చేపట్టారు. వారు మాట్లాడుతూ 2025–26 వార్షిక బడ్జెట్‌లో రైతులకు తీరని అన్యాయం జరిగిందన్నారు. వ్యవసాయానికి ప్రత్యేక కేటాయింపులు లేవని, గిట్టుబాటు ధరలకు చట్టబద్ధత కల్పించాలన్నారు. అనంతరం సబ్‌కలెక్టర్ కార్యాలయ పరిపాలనా అధికారిణి వసుంధరకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు ఈరన్న, చిన్నహరివాణం, తిమ్మప్ప, కె.రమేష్‌కుమార్ పాల్గొన్నారు.

ఆదోని రూరల్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ రైతులు, కూలీలు, కార్మికులకు వ్యతిరేకంగా ఉందని నిరసన తెలియజేస్తూ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కె.లింగన్న ఆధ్వర్యంలో పాండవగల్ గ్రామంలో బడ్జెట్ పేపర్లను దహనం చేశారు. జిల్లా ఉపాధ్యక్షులు కె.లింగన్న, నాయకులు గోవిందు, హనుమంతరెడ్డి, కృష్ణ, హుసేని తదితరులు పాల్గొన్నారు. అలాగే నాలుగు లేబర్ కోడ్‌లను రద్దుచేయాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఆదోనిలోని మున్సిపల్ గ్రౌండ్ నుంచి భీమా సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించి, బడ్జెట్ పత్రాలను దహనం చేశారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పి.ఎస్.రాధాకృష్ణ, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు అజయ్‌బాబు, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు వీరన్న తదితరులు పాల్గొన్నారు.

కోసిగి: కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్ లో రైతులకు తీవ్ర అన్యాయం చేశారని రైతు సంఘం తాలూకా అధ్యక్షుడు గోపాల్ విమర్శించారు. బుధవారం కోసిగిలో సీపీఐ ఆధ్వర్యంలో కౌలు రైతులు, రైతు సంఘం నాయకులు నిరసన తెలిపారు. సీపీఐ నాయకులు ఓంకార్ స్వామి, భీమయ్య, సేకప్ప పాల్గొన్నారు.

కార్మికులకు తీరని అన్యాయం

ఎన్నో ఏళ్ల తరుబడి పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను రద్దు చేసి, వాటి స్థానంలో లేబర్ కోడ్‌లను అమలు చేయడంతో కార్మికులు తీవ్ర నష్టపోవాల్సి వస్తోందని సీఐటీయూ మండల కార్యదర్శి రాముడు, రైతు సంఘం మండల కార్యదర్శి వీరేష్‌లు ఆరోపించారు. బుధవారం స్థానిక వైఎస్సార్ సర్కిల్‌లో లేబర్ కోడ్‌కు నిరసన బడ్జెట్ పత్రాలను కాల్చి నిరసన వ్యక్తం చేశారు.

కష్టజీవులకు శాపంగా కేంద్ర బడ్జెట్

ఎమ్మిగనూరుటౌన్: కేంద్రంలోని బీజేపీ సారథ్యంలో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలాసీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్ కష్టజీవులకు శాపంగా మారిందని సీఐటీయూ, ఏఐటీయూసీ, ఐఎఫ్‌టీయూ నాయకులు గోవిందు, తిమ్మగురుడు, రాముడు, ప్రసాద్ అన్నారు. కేంద్ర బడ్జెట్‌కు నిరసనగా, నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం పట్టణంలో అయా సంఘాల ఆధ్వర్యంలో ర్యాలీ చేపట్టారు. అనంతరం సోమప్ప సర్కిల్‌లో కేంద్ర బడ్జెట్ కాపీలను దహనం చేసి నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్ వ్యవసాయ రంగానికి, రైతులకు, నిరుద్యోగ సమస్య తీర్చేందుకు ఏమాత్రం ఉపయోగపడటం లేదన్నారు.



సోమప్ప సర్కిల్‌లో ఆందోళన చేస్తున్న కార్మిక, కర్షక సంఘాల నాయకులు

ఘనంగా గ్రామ దేవర



జగ్గాపురంలో అమ్మవారికి బోనాలు సమర్పిస్తున్న భక్తులు



సజ్జలగుండంలో కలశాలతో ఊరేగింపుగా వెళ్తున్న భక్తులు

నందవరం : మండల పరిధిలోని హాలహర్వి గ్రామ పంచాయతీ పరిధిలోని జగ్గాపురం గ్రామంలో గ్రామ దేవర ఘనంగా జరిగింది. బుధవారం గ్రామంలో గ్రామ దేవతలు మారెమ్మ, దేవమ్మ అవ్వ దేవర నిర్వహించారు. తెల్లవారుజామున గ్రామ దేవతలకు ప్రజలు ప్రత్యేక పూజలు చేపట్టారు. డప్పుల దరువులు, మేళతాళాలతో పూర్వ వీధుల్లో బోనాలు ఊరేగింపుగా తీసుకెళ్లి అమ్మవార్లకు సమర్పించారు. ఇంటిల్లిపాది నూతన వస్త్రాలు ధరించి పిండి వంటలతో మొక్కులు తీర్చుకున్నారు. ఉత్సవంలో ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి, ఎంపీటీసీ హనుమంతమ్మ, గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకులు కోతి ఈరన్న, నరసరాజు, నరసన్న, రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

దేవరలో పొట్టేళ్ల పందేలు

గ్రామ దేవర పురస్కరించుకుని బుధవారం పొట్టేళ్ల పోటీలు నిర్వహించారు. పెద్ద పెద్ద పొట్టేళ్లతో సాగిన పోరు చూపరులను ఆకట్టుకుంది.

సజ్జలగుండంలో దేవర

కోసిగి: మండల పరిధిలోని సజ్జలగుడ్డం గ్రామంలో గ్రామ దేవతలు మారెమ్మ దేవి, దేవమ్మ దేవిల దేవర ఉత్సవాలు అత్యంత వైభవంగా జరిగింది. బుధవారం వేకువ జామున నుంచి గ్రామంలో అమ్మవారికి కుంకుమార్చన, ఆకు పూజ, ఫల, పుష్పాలంకరణలు గావించి మహా మంగళ హారతులు ఇచ్చి ప్రత్యేక పూజలు చేపట్టారు. ప్రతి ఇంటి నుంచి పూర్ణకుంభాలలో నైవేద్యం తయారు చేసి మేళతాళాలు, డప్పువాయిద్యాలతో పురవీధుల గుండా ర్యాలీగా ఆలయం చెంతకు చేరుకుని, అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. ఉత్సవాలకు వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి పి. మురళీ మోహన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వైఎస్సార్ సీపీ నాయకులు గ్రామ సర్పంచ్ జేకే నరసమ్మ, మాజీ ఎంపీటీసీ ఎ.మూకప్ప, జేకే మల్లయ్యల ఆధ్వర్యంలో ఆయనను శాలువా పూలమాలలతో సన్మానించారు. కార్యక్రమంలో గ్రామ నాయకులు కె.నాగరాజు, వెంకటేష్, బి.యల్లప్ప, జాంబవంతు, చిన్నన్న, ఉలిగప్ప తదితరులు పాల్గొన్నారు.



వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి పి.మురళీ మోహన్ రెడ్డిని సన్మానిస్తున్న వైఎస్సార్ సీపీ గ్రామ నాయకులు

సూగూరులో ..

మంత్రాలయం : మండల పరిదిలోని సూగూరు గ్రామంలో గ్రామ దేవత మారెమ్మ దేవి, దేవమ్మ దేవిల దేవర ఘనంగా నిర్వహించారు. బుధవారం గ్రామంలో గ్రామ దేవతలకు విశేష పూజలు చేపట్టారు. భక్తులు ఇంటింటా పూర్ణకుంభాలలో డప్పు వాయిద్యాలు, మేళతాళాలు కలశాలతో పురవీధుల గుండా ఊరేగింపుగా వచ్చి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. భక్తులు అమ్మవారికి మొక్కులు చెల్లించి చల్లంగా చూడాలని వేడుకున్నారు.

కమ్యూనిస్ట్ నాయకుడికి నివాళి

ఎమ్మిగనూరుటౌన్: కమ్యూనిస్ట్ నాయకుడు హనుమంతు వర్ధంతి కార్యక్రమంలో భాగంగా బుధవారం పట్టణంలో ఆయన చిత్రపటానికి పలు సంఘాలు, పార్టీల నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు నరసన్న, ఏసేపు, హనీఫ్, రామచంద్ర, న్యాయవాది చార్లెస్, రాజోలప్ప తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా చిన్నన్న తాత ఉరుసు



ఉరుసు మహోత్సవంలో పాల్గొన్న భక్తులు

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని వెంకటగిరి గ్రామంలో బుధవారం శ్రీ చిన్నన్న తాత ఉరుసు మహోత్సవం ఘనంగా జరిగింది. ఉదయం నుంచి తాతకు ప్రత్యేక ఫాతెహాలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం ఉరుసు మహోత్సవం అశేష జనవాహిన మధ్య ఘనంగా జరిగింది. ఉరుసు మహోత్సవంలో గ్రామస్తులే కాకా ఇతర గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.

బీసీ రెసిడెన్షియల్ పాఠశాల ఏర్పాటు చేయాలి

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలో బీసీ రెసిడెన్షియల్ పాఠశాలను ఏర్పాటు చేయాలని పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి మహేంద్రబాబు డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీ వసతి గృహాలు లేక పోవడంతో విద్యార్థులు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. జిల్లాలోని పశ్చిమ ప్రాంతమైన ఎమ్మిగనూరు, మంత్రాలయం నియోజకవర్గాల్లో నిత్యం కరువు కాటకాలతో వలసలు వెళుతున్నారని, దీంతో విద్యార్థులు చదువులకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎమ్మిగనూరులో బీసీ రెసిడెన్షియల్ పాఠశాలను నెలకోల్పాలని కోరారు.

9 నుంచి అంతర్రాష్ట్ర ఒంగోలు గిత్తల బండలాగు పోటీలు

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని దేవబెట్ట గ్రామంలో శ్రీ రంగస్వామి జాతరను పురస్కరించుకొని ఈ నెల 9 నుంచి బీవీ మోహన్‌రెడ్డి సార్మక అంతర్రాష్ట్ర నాలుగు పళ్ల ఒంగోలు గిత్తల ఎద్దుల బండ లాగుడు పోటీలను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు సోమేశ్వరరెడ్డి తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో ఈ పోటీలను నిర్వహిస్తున్నామని చెప్పారు. విజేతలకు వరుసగా రూ. 30 వేలు, రూ. 20 వేలు, రూ.15 వేలు, రూ.10 వేలు, రూ.8 వేలు, రూ. 6 వేలు, రూ. 5 వేలు, రూ. 3 వేలు బహుమతిగా ఇవ్వనున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న వారు ఈ నెల 8వ తేది లోపు రూ. 500లు ఎంట్రీ ఫీజు చెల్లించి పేర్లు నమోదు చేయించుకోవాలని చెప్పారు. వివరాలకు సెల్ 99125 71115, 81796 94155 నెంబర్లకు ఫోన్ చేయాలని కోరారు.

విద్యావ్యవస్థను నిర్వీర్యం చేస్తున్న ప్రభుత్వం

ఎమ్మిగనూరుటౌన్: విద్యావ్యవస్థను రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా నిర్వీర్యం చేస్తోందని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రంగప్ప ఆరోపించారు. బుధవారం పట్టణంలోని కేవీపీఎస్ కార్యాలయంలో ఎస్ఎఫ్ఐ పట్టణ మహాసభను నిర్వహించి నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఎస్ఎఫ్ఐ పట్టణ కమిటీ అధ్యక్షుడిగా రాము, కార్యదర్శిగా విజయ్‌లతో పాటు 30 మంది కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు.

పాఠశాలకు కంప్యూటర్ విరాళం

ఆదోని సెంట్రల్: పట్టణంలోని నెహ్రూమెమోరియల్ ఉన్నత పాఠశాలకు ఐడీబీఐ బ్యాంకు ఆధ్వర్యంలో రూ. 50వేలు విలువ చేసే కంప్యూటర్, ప్రింటర్, మైక్రోస్కోప్ తదితర వస్తువులను బుధవారం పంపిణీ చేశారు. బ్యాంకు మేనేజర్ సోమన్న మాట్లాడుతూ బ్యాంకు నిర్ణయం మేరకు ప్రభుత్వ పాఠశాలలకు పంపిణీ చేయడానికి సీఎస్ఆర్ నిధుల కింద ఈ వస్తువులను సమకూర్చినట్లు తెలిపారు. అనంతరం ఉపాధ్యాయులు బ్యాంకు మేనేజర్‌ను సన్మానించారు. కార్యక్రమంలో గుంతకల్ ఐడీబీఐ బ్యాంకు మేనేజర్ హరీష్, ఇన్‌చార్జ్ హెచ్ఎం సుధాకర్, ఉపాధ్యాయులు రంగారెడ్డి, ప్రహ్లాద్, జాన్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య పరిరక్షణకు జాగ్రత్తలు తీసుకోవాలి

బాలికలు ఆరోగ్య పరిరక్షణకు తగు జాగ్రతలను తీసుకోవాలని ఆదోని ఆర్ట్స్ కళాశాల ఎన్ఎస్ఎస్ డివిజన్ అధికారి జోనాథన్ వీక్లిఫ్, మాస్టర్ ట్రైనర్ సంధ్య రాణి అన్నారు. బుధవారం నెహ్రూ మెమోరియల్ ఉన్నత పాఠశాలలో బాలికలకు ఆరోగ్య పరిరక్షణ, ఆర్గానిక్ శానిటర్ ప్యాడ్స్‌పై అవగాహన కల్పించారు. ఆరోగ్యం విషయంలో నిర్లక్ష్యం చేయకుండా బాలికలు తీసుకోవాల్సిన జాగ్రతలను సూచించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ హెచ్ఎం సుధాకర్ ఉపాధ్యాయురాళ్లు ప్రకాశమ్మ, పద్మావతి, సువేదమ్మ, అపర్ణ తదితరులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకునేలా చూడండి



మాట్లాడుతున్న జడ్జి పి.జె.సుధ

ఆదోని రూరల్: మార్చి 8వ తేదీన జరిగే జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకునేలా చూడాలని పోలీసు అధికారులను ఆదోని రెండో అదనపు జిల్లా జడ్జి పి.జె.సుధ ఆదేశించారు. బుధవారం స్థానిక కోర్టు ప్రాంగణంలో ఆదోని పట్టణం, రూరల్‌లోని పోలీసు అధికారులు, న్యాయమూర్తులతో సమావేశం నిర్వహించారు. జడ్జి మాట్లాడుతూ కక్షిదారులకు కౌన్సెలింగ్ ఇచ్చి రాజీ అయ్యేలా ప్రోత్సహించాలన్నారు. కోర్టుల చుట్టూ తిరిగి సమయాన్ని వృధా చేసుకోరాదన్నారు. కేసుల పరిష్కారంలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. సీనియర్ సివిల్ జడ్జి యజ్ఞ నారాయణ, పీడీఎం జడ్జి అర్చన, ఫస్ట్ అడిషనల్ జడ్జి లీలాసాయిసుభాష్, సెకండ్ అడిషనల్ జడ్జి శ్రీవల్లి, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

ప్రీ స్కూల్ నుంచే విద్యపై ఆసక్తి పెంచాలి



చిన్నారులకు అన్నప్రాశనం చేస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ క్యాతాయిని

కోసిగి: ప్రీస్కూల్ నుంచే పిల్లలకు ఆట పాటలతో కూడిన విద్యను బోధిస్తూ పిల్లల్లో ఆసక్తి పెంచాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కాత్యాయిని అన్నారు. బుధవారం స్థానిక 18వ అంగన్‌వాడీ కేంద్రంలో 8, 10, 13, 14, 15వ అంగన్‌వాడీ పరిధిలో చిన్నారులు, తల్లిదండ్రులకు ఈసీసీఈ డే కార్యాక్రమంలో భాగంగా అవగాహన నిర్వహించారు. చిన్నారులకు అన్నప్రాశన చేయించారు. ఆమె మాట్లాడుతూ ప్రాథమిక పాఠశాలకు చేరే ముందుగా అంగన్‌వాడీ కేంద్రాల్లో 3 ఏళ్ల నుంచి 5 ఏళ్ల మధ్య వయస్సు పిల్లలకు బొమ్మలు, ఆట వస్తువుల చూపిస్తూ బాలగేయాలతో విద్యను నేర్పించాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు లూసమ్మ, వరలక్ష్మి, జ్యోతి, భీమలింగమ్మ, దేవి తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలి

నందవరం : ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఎస్ఐ శ్రీనివాసులు సూచించారు. బుధవారం మండల పరిధిలోని ముగతి సర్కిల్‌లో వాహనాల తనిఖీ చేపట్టారు. ఆయన మాట్లాడుతూ..వాహనదారులు రోడ్డు నిబంధనలు పాటించాలన్నారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు బయటకు వెళ్లేటప్పుడు హెల్మెట్ ధరించాలని, డ్రైవింగ్ లైసెన్స్ ఉంచుకోవాలని సూచించారు. అలాగే బైక్‌లను మైనర్లకు ఇవ్వవద్దని, మైనర్లకు బైక్ ఇచ్చి డ్రైవింగ్‌లో పట్టుబడితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి

నందవరం : కార్మిక, కర్షక వర్గాల హక్కులను కాలసే లేబర్ కోడ్‌లను కేంద్ర ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని సీఐటీయూ నియోజకవర్గ కార్యదర్శి రాముడు, సమగ్ర శిక్ష ఉద్యోగ సంఘాల నాయకుడు ఉరుకుందు డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలోని లేబర్‌కోడ్‌లకు వ్యతిరేకంగా ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలో కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ చేపట్టారు. వారు మాట్లాడుతూ.. పెట్టుబడిదారులకు పెద్దపీట వేసే లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలన్నారు. స్వాతంత్ర్యం రాకముందు నుంచి పోరాడి తెచ్చుకున్న కార్మిక చట్టాలను మోదీ ప్రభుత్వం రద్దు చేసిందన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్ పద్మ, భాగ్యలక్ష్మి, భాగ్యమ్మ, రామలింగమ్మ, వెంకటేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలను నిర్వీర్యం చేయడం తగదు

ఆదోని సెంట్రల్: విద్యావ్యవస్థలో నూతన సంస్కరణల పేరుతో ప్రాథమిక పాఠశాలలను నిర్వీర్యం చేయడం తగదని ఎస్టీయూ సహ అధ్యక్షుడు నాగరాజు, రాష్ట్ర పురపాలక కన్వీనర్ వీరచంద్ర యాదవ్, జిల్లా ఉపాధ్యక్షుడు రమేష్ నాయుడు, సీనియర్ నాయకులు సుధాకర్ ముక్తకంఠంతో ఖండించారు. బుధవారం నెహ్రూమెమోరియల్ ఉన్నత పాఠశాల ఆవరణలో భోజనం విరామం సమయంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. వారు మాట్లాడుతూ జీవో నెంబర్.117 రద్దు పేరుతో చేసిన సంస్కరణలు విద్యావ్యవస్థకు గొడ్డలిపెట్టుగా ఉన్నాయని ఆరోపించారు. గ్రామ స్థాయిలో ఉన్న అన్ని పాఠశాలలను ఒకే పాఠశాల కిందకు విలీనం చేయడం తగదన్నారు. వెంటనే ప్రాథమిక పాఠశాలల విలీనాన్ని అపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్టీయూ నాయకులు భీమరాజు, లోక్యనాయక్, ప్రసాద్, ప్రహ్లాద్ తదితరులు పాల్గొన్నారు.